నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, గురువారం 31 అక్టోబర్ 2024 | MEDAK

అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి

- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

సిద్దిపేట, అక్టోబర్ 30: ఉమ్మడి జిల్లా ప్రజలకు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారదోలే వెలుగుల పండుగ దీపావళికి హిందూ సంస్కృతిలో విశేషమైన ప్రాశస్త్యం ఉందని పేర్కొన్నారు. దీపావళి ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, పిల్లలు పటాకులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. లక్ష్మీనారాయణుడి అనుగ్రహంతో అందరికీ శుభం చేకూరాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు.

250 పడకలకు హుస్నాబాద్ దవాఖాన అప్‌గ్రేడ్

- రూ.82 కోట్ల నిధులు మంజూరు
- వెల్లడించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, అక్టోబర్ 30: హుస్నాబాద్‌లోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 250 పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాకు ఒక ప్రకటనలో దవాఖాన అప్‌గ్రేడ్ అయిన విషయాన్ని వెల్లడించారు. అప్‌గ్రేడ్ చేయడంతోపాటు రూ.82 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం 100 పడకలుగా ఉన్న హుస్నాబాద్ దవాఖాన నియోజకవర్గ ప్రజలకు అన్నిరకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచేలా 250 పడకలుగా మార్చాలని ప్రభుత్వానికి నివేదిక అందించగా బుధవారం జీవో జారీ చేసినట్లు చెప్పారు. వైద్య విధాన పరిషత్ ద్వారా జీవో తోపాటు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఇతర మంత్రులకు పొన్నం ధన్యవాదాలు తెలిపారు.

పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ధర్నాలు, నిరసనలతో అట్టుడుకుతున్న తెలంగాణ
- రేవంత్ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు..
- బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 30: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ విధానాలతో రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదని.. ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో రాష్ట్రం అట్టుడుకుతున్నదని బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ..చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పోలీసులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి సంఘనలు చోటుచేసుకోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. పోలీసులకు ఇచ్చిన ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ పోలీసుల భార్యలు రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు చేస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పది నెలలుగా అనాలోచిత విధానాలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు, గురుకులాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని అభ్యర్థులు, ఏళ్లవో ఉద్యోగులు, మూసి భయంలో పేదలు రోడ్ల మీదికొచ్చి ధర్నాలు చేస్తున్నారని, ఈ పరిస్థితికి కారణం ప్రభుత్వమే అని ఆరోపించారు. ప్రణాళికల రూపకల్పనలో ప్రభుత్వం విఫలమవడంతో రాష్ట్రం సమస్యల సుడిగుండంలో చిక్కుకుందని, రోజుకో డ్రామాతో డైవర్షన్ రాజకీయాలు చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. డీఏలు రాక ఉద్యోగులు, రుణమాఫీ కాక, రైతుభరోసా రాక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మసిపూసి మారేడుకాయ చేసేందుకే రేవ్‌పార్టీ అనే కొత్త డ్రామాను రేవంత్‌రెడ్డి సర్కార్ తెరమీదకు తెచ్చి కేసీఆర్ కుటుంబాన్ని బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము లేక రేవ్‌పార్టీ పేరుతో రాజకీయలబ్ధి పొందాలని చూస్తున్నదని కాంగ్రెస్‌పై ప్రతాప్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు వంటేరు ప్రతాప్‌రెడ్డి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మహాయజ్ఞంలా బీసీ కుల గణన

- ఉమ్మడి మెదక్ జిల్లాలో 96 పిటిషన్లు వచ్చాయి
- 42శాతం రిజర్వేషన్లతో బీసీలకు న్యాయం
- ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టంలా బీసీలకు రక్షణ చట్టం తేవాలి
- సర్వేను కలెక్టర్, అధికారులు తనిఖీ చేయాలి
- అభిప్రాయ సేకరణలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

సంగారెడ్డిలో బీసీ సంఘాల సమస్యలను కమిషన్ దృష్టికి తెస్తున్న జాతీయ కార్యదర్శి బీరయ్యయాదవ్

సంగారెడ్డి, అక్టోబర్ 30: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాత జిల్లాల వారీగా బీసీ కుల గణననకు బీసీ కమిషన్ బృందం అభిప్రాయ సేకరణ చేపడుతున్నదని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ కుల గణన అభిప్రాయ సేకరణను బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ అభిప్రాయ సేకరణలో మూడు జిల్లాలకు చెందిన 96 మంది బీసీ సంఘాల నాయకులు పలు అంశాలపై కమిషన్‌కు పిటిషన్లు ఇచ్చారు. సమాజంలో జరుగుతున్న పరిస్థితులను ఆయా కుల సంఘాల నాయకులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కుల గణనను సమగ్రంగా చేపట్టి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. గతంలో ప్రకటించిన విధంగా బీసీ కులాలకు చట్టసభల్లో 42శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు ప్రభుత్వాలు స్పందించక పోవడం శోచనీయమన్నారు. ప్రస్తుత కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో బీసీ కులాలకు న్యాయం జరిగేలా కమిషన్ పనిచేస్తుందని చెప్పారు. చట్టసభల్లో వెనకబాటుకు గురవుతున్న బీసీలకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసి సర్వేకు ఆదేశాలిచ్చిందన్నారు. ఈ సర్వే నవంబర్ 6 నుంచి ప్రారంభమవుతుందని, బీసీ కుల సంఘాల నాయకులు, సభ్యులు బీసీ కుల గణననకు పూర్తి వివరాలు అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలు అందజేయడంతో బీసీల సంఖ్య ప్రభుత్వానికి తెలుస్తుందన్నారు. గతంలో బీసీ కుల గణననకు ఎన్నో కమిషన్లు వేసినా ఫలితాలు శూన్యమని, ప్రస్తుతం జరిగే కుల గణన పారదర్శకంగా నిర్వహించి బీసీ కులాలకు న్యాయం చేసేలా చూస్తామన్నారు. ఏబీసీడీ వర్గీకరణతో కాకుండా కులాల వారీగా బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరగుతుందని, కొన్ని బీసీ సంఘాల నాయకులు పిటిషన్లు ఇచ్చారన్నారు.

సర్వేను కలెక్టర్లు తనిఖీ చేయాలి...

గ్రామాల్లో నవంబర్ 9 నుంచి జరిగే బీసీ కుల గణనను కలెక్టర్, జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేసి ఎన్యూమరేటర్లకు అవగాహన కల్పించాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎన్యూమరేటర్లు సర్వే పారదర్శకంగా చేపట్టేలా అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్యూమరేటర్లు చేసే తప్పిదంతో భవిష్యత్తులో కులం పేరు మారిపోయే పరిస్థితి రాకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కమిషన్ సేకరించిన బీసీ సంఘాల అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ముఖ్యంగా జిల్లాస్థాయి సమావేశాలకు కలెక్టర్లు హాజరై కుల సంఘాల అభిప్రాయాలను తెలుసుకుంటే సర్వేకు పూర్తి అవగాహన వస్తుందని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు అట్రాసిటీ చట్టం అండగా ఉందని, బీసీ కులాలకు అలాంటి రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కుల సంఘాల నాయకులు కమిషన్‌కు ఇచ్చిన పిటిషన్‌లో పేర్కొన్నారని చైర్మన్ గుర్తుచేశారు. ముఖ్యంగా దొమ్మరి కులం, తమ్మలికులం ఆయా కులాలు చేసే కుల వృత్తులను బహిరంగంగా చెప్పుకోలేని పరిస్థితిలో ఉండడం శోచనీయమన్నారు. లోదికులం బీసీలో ఉన్నా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడం, ఆరె కటికెలను ఎస్సీలుగా మార్చాలని ఆయా సంఘాల నాయకులు కమిషన్ దృష్టికి తెచ్చారన్నారు.

మెదక్, సిద్దిపేట కలెక్టర్లపై కమిషన్ ఆగ్రహం

ఉమ్మడి జిల్లాకేంద్రాల్లో నిర్వహిస్తున్న బీసీ కుల సంఘాల అభిప్రాయ సేకరణలో ఆయా జిల్లాల కలెక్టర్లు హాజరుకాకపోవడం శోచనీయమని కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్లు కమిషన్ అభిప్రాయ సేకరణకు హాజరుకాలేదని సీఎంకు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పుదాలు జరగకుండా కమిషన్లను ప్రభుత్వం నియమించిందని, కలెక్టర్లు కమిషన్ బృందానికి స్వాగతం పలికి సంఘాల వివరాలు సేకరించడానికి దోహదపడాలని సూచించారు.

బీసీ కమిషన్‌కు అభిప్రాయాలు చెప్పాలి : కలెక్టర్

సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోని బీసీ సంఘాల ప్రతినిధుల కమిషన్‌కు అభిప్రయాలు తెలియజేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. నవంబర్ 6 నుంచి చేపట్టనున్న సమగ్ర బీసీ కుల గణనకు ప్రతిఒక్కరూ పాల్గొని అభిప్రాయాలను చెప్పాలన్నారు. సమావేశంలో బీసీ కమిషన్ బృందం సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, కమిషన్ ప్రత్యేకాధికారి కోచైర్మన్ సతీశ్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బట్టి వెంకటయ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్, సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీటీసీడీవోలు గజదీశ్, నాగభూషణం, షేక్‌అహ్మద్, బీసీ సంఘాల నాయకులు, కులసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్ ఆగ్రహం

సంగారెడ్డి, అక్టోబర్ 30: బీసీ కమిషన్ అంటే ఇంత చులకనా, జిల్లాకు వస్తే కలెక్టర్ స్వాగతం తెలపకపోవడం విడ్డూరంగా ఉందని కలెక్టర్ వల్లూరు క్రాంతిపై రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ అటోడిరియంలో బీసీ కుల గణనపై బీసీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధుల నుంచి అభిప్రాయ సేకరణకు వచ్చిన బీసీ కమిషన్ బృందానికి స్వాగతం పలకకపోవడంతో కమిషన్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వెనకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ చేపట్టేందుకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చిన కమిషన్ చైర్మన్, సభ్యులకు ప్రొటోకాల్ ప్రకారం కలెక్టర్ స్వాగతం పలకాలి. కానీ, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్వో పద్మజారాణి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి కమిషన్‌కు స్వాగతం పలకడంతో కమిషన్ బృందానికి ఆగ్రహం తెప్పించింది. దీంతో ప్రొటోకాల్ ప్రకారం కలెక్టర్ రావాలి కదా..! ఎందుకు రాలేదంటూ చైర్మన్ నిరంజన్ అధికారులను ప్రశ్నించారు. బీసీ కమిషన్ అంటే కలెక్టర్‌కు అంత చులకనా, కమిషన్ అంటే తమాషాగా ఉందా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానన్నారు.



బీసీ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్, రెవెన్యూ అధికారులు

కూలీలకు పునరావాసం కల్పించాలి



నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కూలీలు

జహీరాబాద్, అక్టోబర్ 30: వ్యవసాయ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి కోల్పోతున్న కూలీలకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంచందర్ డిమాండ్ చేశారు. జహీరాబాద్‌లోని నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల ఎదుట బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు, కూలీలు ధర్నా చేసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ..కూలీలకు పునరావాసం కల్పించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పరిశ్రమల కోసం సేకరించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు కూలీలకు పునరావాసం కల్పించిన తర్వాతే పరిశ్రమల ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని కూలీలకు పునరావాసం కల్పించాలన్నారు. ఈ మేరకు అధికారులకు వినతి పత్రాలను అందజేసినట్లు చెప్పారు. ఆందోళనలో శంకర్, మనోహర్, జయమ్మ, బలప్ప, నర్సమ్మ, కూలీలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

భరత్ (ఫైల్), బేతయ్య మృతదేహం

టేక్మాల్, అక్టోబర్ 30: పిడుగుపాడి ఇద్దరు మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలం ధనూరలో బుధవారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం..బండారు బేతయ్య(46), డాకూరి భరత్(16) ధనూర గ్రామ శివారులో గొర్రెలను మేపడానికి వెళ్లారు. సాయంత్రం సమయంలో అకాల వర్షం మొదలైంది. ఇద్దరు సమీపంలోని వేప చెట్టు కిందకు వెళ్లి నిలబడ్డారు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో పిడుగు పడింది. దీంతో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారి మృతదేహాలను గ్రామంలోకి తరలించారు. ఒకే ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విధివక్రించి.. మృత్యువు కబళించింది

డాకూరి భరత్ పదో తరగతి చదువుతున్నాడు. రోజూ తండ్రి శ్రీశైలం గొర్రెలను మేపడానికి వెళ్లేవాడు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం కూడా వెళ్లాడు. ధాన్యాన్ని ఆరబెట్టడానికి వెళ్తానని, పాఠశాలకు సెలవులు కావడంతో భరత్‌ను మధ్యాహ్నం నుంచి గొర్రెలు మేపడానికి ఉంచాడు. సాయంత్రం అకాల వర్షం కురవడం, పిడుగు పడడంతో అతడిని మృత్యువు కబళించింది. దీంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలో మంట కాచుకుంటున్న రైతులు

చలి ఘరూ..

చలికాలం ప్రారంభం కావడంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. చలి తీవ్రత పెరుగుతున్నది. వారం రోజులుగా రామాయంపేట, నిజాంపేట, తూప్రాన్, చేగుంట మండలాలతో పాటు జిల్లా అంతటా పొగమంచు కమ్ముకుంటున్నది. అర్ధరాత్రి నుంచి మొదలవుతున్న పొగమంచు ఉదయం 8 గంటలు దాటినా వీడడం లేదు. పొగమంచు మూలంగా చలి తీవ్రత పెరిగి ఉదయం వివిధ పనులకు వెళ్లేవారు చలితో వణుకుతున్నారు. చలిమంటలు కాచుకుంటున్నారు. పొగమంచు మూలంగా వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నారు. రామాయంపేట, మెదక్‌లో స్వెట్టర్ల దుకాణాలు వెలిశాయి. చలి నుంచి రక్షణకు ప్రజలు ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్నారు.

– రామాయంపేట, అక్టోబర్ 30

చలికి వణుకుతున్న కూలీ

తొనిగండ్ల రోడ్డును కమ్మేసిన పొగమంచు

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ

సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్, సీపీ

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబర్ 30: జిల్లాలోని జాతీయ, రాష్ట్ర, ఇతర అన్నిరకాల రహదారులపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు భద్రతా చర్యలు తీసుకోవాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో సీపీ డాక్టర్ అనురాధ, సంబంధిత శాఖల అధికారులతో డిస్ట్రిక్ట్ లెవల్ రోడ్ సేఫ్టీ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించి రోడ్డు భద్రతపై తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి భద్రత జీవితానికి రక్షణ అని అన్నారు. పోలీస్ శాఖతో కలిసి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు జిల్లాలోని జాతీయ రహదారులు, ఇతర ప్రధాన రహదారులను కలిపే ప్రాంతాల్లో ఆయా రహదారులను పరిశీలించి స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారులపై పనులు జరుగుతున్న ప్రాంతాల్లో నేషనల్ హైవే అథారిటీ అధికారులు డైవర్షన్ బోర్డులు తప్పక ఏర్పాటు చేయాలని సూచించారు. రాజీవ్ రహదారిపై బ్లింకింగ్ లైట్లు అన్ని పనిచేసేలా చూడాలని, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలను తొలింగించాలన్నారు. దుద్దెడ,కుకునూర్‌పల్లి,గౌరారం, వంటి మామిడి గ్రామాల వద్ద ప్రమాదాలు జరగకుండా రెయిలింగ్ సీడ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిబంధనల మేరకే రహదారుల నుంచి నిర్దేశిత దూరం పాటించి వైన్‌షాప్‌లు ఉండేలా చూడాలని ఎక్సైజ్ శాఖ అధికారులను సూచించారు. సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లో ప్రయాణికులు దిగడానికి, ఎక్కడానికి బస్సులను రోడ్డు పక్కనే ఆపాలని ఆర్టీసీ అధికారులను సూచించారు. సీపీ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ.. ప్రయాణికులు,వాహనదారులు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండడంతో రహదారి ప్రమాదాలు నివారించవచ్చన్నారు. పోలీస్‌శాఖ సూచించే నియమ నిబంధనలు డ్రైవర్లు తప్పక పాటించాలన్నారు. సమీక్షలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మూర్తి, జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు, ఏసీపీలు మధు, పురుషోత్తం, సతీశ్, సుమన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత...ప్రయాణం చింత

సంగారెడ్డి పట్టణంలోని పోతరెడ్డిపల్లి ఎక్స్ రోడ్డు నుంచి పటాన్‌చెరు, హైదరాబాద్ వెళ్లే ప్రధాన రోడ్డు దెబ్బతిన్నది. అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుంతలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు తిరిగే ఈ రోడ్డును పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్
సంగారెడ్డి, అక్టోబర్ 30

ఆలయ పాలకవర్గాలు ఏర్పాటయ్యేనా ?

- దేవాదాయ, ధర్మాదాయ శాఖ అలసత్వం
- రెండేండ్లుగా నోటిఫికేషన్‌లో జాప్యం

బొంతపల్లిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం

గుమ్మడిదల, అక్టోబర్ 30: ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాలకు రెండేండ్లుగా పాలకవర్గం లేక ఆలయాల నిర్వహణ, అభివృద్ధి కుంటుపడుతోంది. ఏటా శ్రావణ, కార్తిక మాసాల్లో ప్రముఖ దేవాలయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో ఈవోలు, సిబ్బందితో దేవాలయాలను నిర్వహించడం కష్టంగా మారింది. ఒక్కో ఈవో మూడు, నాలుగు దేవాలయాలకు ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పూర్తిగా ఒక్కో ఆలయంపై దృష్టిపెట్టలేక పోతున్నారు. దీంతో పండుగలు, విశేష రోజుల్లో ఆలయానికి వచ్చే భక్తులకు సరైన సేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయాల్లో భక్తులు వేసిన కానుకలు, హుండీ ఆదాయంపై ఉన్న శ్రద్ధ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై దేవాదాయ శాఖ దృష్టి సారించకపోవడంతో భక్తులు మండిపడుతున్నారు. రెండేండ్ల క్రితం బీఆర్ఎస్ పాలనలో ఆలయాల పాలకవర్గం పదవీ కాలం ముగిసిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ట్రస్ట్ బోర్డు ఏర్పాటవుతుందని ఎదురుచూశారు. ఇంతలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఎన్నికల అనంతరం ట్రస్ట్ బోర్డు ఏర్పాటు నోటిఫికేషన్ రావడంతో జాప్యమైంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని దేవాలయాలకు పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చినా మధ్యలోనే ఆగిపోయాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటై ఏడాది కాబోతున్నది. ఇప్పటి వరకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకనైనా ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు సంబంధిత అధికారులు, దేవాదాయ శాఖ మంత్రి చొరవ తీసుకుని వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో...

ఉమ్మడి మెదక్ జిల్లాలోని బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం, బీరంగూడ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి ఆలయం, రుద్రారంలోని గణేశ్ ఆలయం, కొమురవెల్లిలోని మల్లికార్జునస్వామి ఆలయం, ఝరాసంగంలోని సంగమేశ్వరస్వామి ఆలయం, హత్నూర మండలం శేర్‌ఖాన్‌పల్లిలోని పలుగు పోచమ్మ ఆలయంతోపాటు ఇతర ఆలయాలకు పాలకవర్గం లేకపోవడంతో ఆలయాల నిర్వహణ కష్టతరంగా మారింది. నవంబర్ 2 నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుండడంతో భక్తుల తాకిడీ అధికంగా ఉంటుంది. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు మొదలు పూజాధికార్యాలు ఆచరిస్తారు. పాలకవర్గం ఉంటే భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయించే అవకాశం ఉంటుంది.

పోలీసుల అదుపులో మహిళా అఘోరా

చేర్యాల, అక్టోబర్ 30 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం రాత్రి మహిళా అఘోరా హల్‌చల్ చేసింది. తాను గతంలో ప్రకటించిన విధంగా ఆత్మార్పణ చేసుకుంటానని తెలియజేయడంతో ఒక్కసారిగా పోలీస్ యంత్రాంగం అలర్ట్ అయ్యింది. రాత్రి సమయంలో మహిళా అఘోరా కొమురవెల్లిలో దర్శనం ఇవ్వడంతో భక్తులతోపాటు స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఉదయం కొండగట్టు ఆంజనేయస్వామి, వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాలను సందర్శించి కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి వెళ్లి ఆత్మార్పణ చేసుకుంటానని ప్రకటించింది. విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా పోలీసులు కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో భారీగా మోహరించారు. సనాతన ధర్మం, హిందూ ధర్మ రక్షణ కోసం, ప్రజల కోసం తాను ఆత్మార్పణ చేసుకుంటానని మహిళా అఘోరా తెలిపింది.గురువు ఆదేశాల మేరకు తాను రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలను సందర్శిస్తున్నానని, హిందూ ధర్మ పరిరక్షణకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఆత్మార్పణకు సిద్ధం కావడంతో ఆమెను స్టేషన్‌కు తరలించారు.

కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో మహిళా అఘోరా